సరస్వతి కష్టములు గట్టెక్కుట

శ్రీమతి మాగంటి శకుంతలాదేవిగారు

౧

ఒకనాటి సాయంకాలమున రాజేశ్వరరావను నవయువకుడు తనస్వగ్రామమును జేరుటకై గూడూరు స్టేషనుచేరెను. తాను వెడలనున్న ధూమశకటముయొక్క రాక కొక గంట వ్యవధి ఉండుటచే నాతడు జనులయొక్క రాక పోకలను పరీక్షించుచూ ఇటునటు తిరుగుచుండెను. ఆ సమయమున దుఃఖితవదనయైయున్న యొక యువతిని గాంచి యామె వృత్తాంత మారయ నుద్యుక్తుడై యడుగ సాహసింపలేక మరల తిరుగ నారంభించెను. ఇంతలో నామెకు దుఃఖ మతిశయించి బాష్పబిందువులు రాల జొచ్చెను. ఆమె దుస్థితిని కనులారగాంచిన రాజేశ్వరరావు సాహసించి ఆమెను సమీపించుచుండగా చాల సేపటి నుండి యామె ఒంటరిగా నుండుటచూచి దురుద్దేశపూరితుడైన, రక్షకభటు డొకడువచ్చి యామె నీక్రింది విధమున ప్రశ్నింపుచుండెను.

శ్రీమతి మాగంటి శకుంతలా దేవిగారు

"మీ రేయూరు? మీతో నెవరైనగలరా?"

"ఏమి? నేనుగలను" అనిరాజేశ్వరరావు జవాబొసగెను. రక్షకభటుడు తత్తరపాటుతో "స్త్రీలు ఒంటరిగానుండిన ప్రమాదము జరుగునని ప్రశ్నించితి" నని ప్రత్యుత్తర మొసగెను.

తనకును, ఆమెకును సంబంధములేనట్లాయువతి చెప్పునేమో యనెడిభయము రాజేశ్వరరావు మనమున లేకపోలేదు. వెంటనే యారక్షకభటుడు విఫలమనోరథుడై వెడలిపోయెను. రాజేశ్వరరావామె నీవిధముగ నడుగనారంభించెను. "అమ్మా! నీ విచ్చట నొంటరిగా నుండి దుఃఖించుటకు కారణమేమి? నీకిచ్చట తోడెవరును లేరా?"

యువతి మౌనవతియై యూరకుండెను. అంతటితో రాజేశ్వరరావూరకుండక మరల ఇట్లు పలుకరించెను.

"తల్లీ! మౌనవతివై యుంటివేమి? నీవు విచారహృదయముతో నుండుటజూచి నాచేనైన సహాయమును జేయనెంచి నిన్నిట్లడుగుచుంటిని."

ఆయువతి వెక్కి వెక్కి యేడ్చుచూ "నాకిచ్చట సహాయులెవరూ లే"రనెను.

"అటులైన నీవెట్లువచ్చితివి?"

"నాసోదరునితో వచ్చితిని."

"నీసోదరు డెచ్చట నుండెను?"

"నన్నిచ్చటవిడిచి వెళ్లెను."

(ఆశ్చర్యమగ్నుడై) "ఏమి? నిన్నుఒంటరిగా విడిచి వెళ్లెనా?"

"అవును"

"అటులైన నీవిప్పుడేమి చేయనెంచితివి?"

సరస్వతి మిన్నకుండెను.

"సోదరీ! ప్రస్తుతము మాగ్రామమురమ్ము. అచ్చటినుండి నీవెచ్చటకేగెదవన్న అచ్చటకు బంపెదను."

యువతి అంగీకారసూచన తెల్పెను. ఇంతలో బండికి టైముఅగుటజూచి టిక్కెట్లు తీసికొని బండికిరాగానే ఎవరి నియమితస్థానములయందు వారాసీనులైరి. బండి నడచెను.

రాజేశ్వరరావుగారి స్వగ్రామమైన తెనాలిజేరిరి. అశ్వశకటముపై వీరిరువురను రాజేశ్వరరావుగారి మిత్రులగు మోహనరావుగారింటికి వెళ్లిరి. యువతిని మోహనరావుగారి గృహముననుంచి రాజేశ్వరరావు తాను స్వగృహమునకేగెను.

౨

శ్రీరాములుగారు సనాతనధర్మపరాయణులు. వీరి కిరువురు కుమారులుగలరు. పెద్దకుమారుడైన రాజేశ్వరరావు సంఘసంస్కర్త. రాజేశ్వరరావు ప్రవర్తన తండ్రికి సరిపడకుండెను. ఇట్లున్నను తన పట్టును వీడక రాజేశ్వరరావు విధవావివాహములయందును అందుకు సంబంధించిన యుపన్యాసములిచ్చుటయందును మిక్కిలి పట్టుదలతో మెలగుచునే యుండెను. ఇందుచేత తనకుటుంబమునకేమైనహాని గల్గునేమోయని తండ్రి మిక్కిలి భయపడుచుండెడి వాడు. తండ్రికి మరింత కష్టము కలుగజేసిన వాడనగుదుననియు, భార్యయైన వరలక్ష్మమ్మకేమైన సందేహము గలుగునేమో యను తలంపుతోను యువతిని తనమిత్రుడైన మోహనరావుగారింటివద్ద నుంచెను. మోహనరావు స్వతంత్ర గృహస్థుడును, ధనసంపన్నుడును అయి ఉండెను.

సంఘసంస్కరణమునం దతియుత్సాహియై యనాథల బ్రోచుటయందును, వితంతూద్వాహములు జరిపించుటయందును, తన స్వంతద్రవ్యమును వ్యయపరచి శరీరశ్రమ కోర్చుచూ తాను నమ్మిన ప్రతిమంచికార్యములోను మిక్కిలి దీక్షాపరుడై మంచిపేరును గడించెను.

మోహనరావు భార్యయగు సావిత్రికూడ చాలవివేకవతి. విద్యలయందును గృహకృత్యములయందును మిగుల నేర్పరియై పతియొనరించు ప్రతికార్యమునందును బహుయుత్సాహముగలదియై శక్తివంచన లేక తోడ్పడుచుండెడిది.

3

మరునాడు రాజేశ్వరరావుగారు సాయంకాల మారుగంటలవేళ మోహనరావును కలుసుకొనెను. వారుభయులు ఆమెయున్న మేడపైగదిలోనికి వెళ్లిరి. వీరి రాకనుజూచి ముసుగుతో పరుండియున్న యాయువతి దిగ్గునలేచి కూర్చుండెను. వారి కోర్కెప్రకారము తన వృత్తాంత మంతయు నీవిధముగ చెప్పదొడంగెను.

"నాజన్మస్థానము బందరు. నేనొక బ్రాహ్మణస్త్రీని. నాపేరు సరస్వతి. నాతండ్రిపేరు రామశాస్త్రిగారు, మాతల్లి లక్ష్మీదేవమ్మ. సోదరుడు గోవిందరావు. మామాతాపితలకు మేమిరువురమే. నా అత్తవారు సికింద్రాబాదు. వివాహమయిన ఆరుమాసములకే నాభర్తగతించెను.

అప్పటినుండియు నేను నాపుట్టింటనే యుంటిని. నా అత్తవారు నాభర్త గతించిన తరువాత నన్నెన్నడును తీసికొని వెళ్లలేదు. నాభర్తగతించి నాలుగువత్సరము లయినది. నేను పుట్టింటనుండుట నాసోదరునకు, నావదెనకు చాల కష్టముగా నుండి నన్ను మిక్కిలి దుర్భాషలాడుచుండెడివారు. చాలకాలము సహించి యూరకుంటిని. వ్రాతఫల మిట్లుండెగదాయని కాలమట్లేగడపుచుంటిని. వారు పెట్టుబాధలు నానాటికి వృద్ధియగుచుండెను. నావదెనగారి దుర్బోధనల చేతనో, లేక నాసోదరుడు తనదురాలోచన చేతనో తిరుపతియాత్రయను మాయోపాయముచే నన్ను గూడూరుస్టేషనున దిగవిడిచి తానెటుబోయెనో తిరిగి కానరాడాయెను. సోదరునిచే పరిత్యజింపబడినందునకును, దరిద్రదేవత నన్ను వెంటాడుచున్నందుకును విలపించుచుండగా మహానుభావులగు రాజేశ్వరరావుగారి దయకు పాత్రురాలనైతిని." ఇట్లు చెప్పుచుండ ఆమెకు బాష్పములు రాలజొచ్చెను. దుఃఖ మధికమయ్యెను.

"సోదరీ! దుఃఖింపకుము. గతించినవాటికి వగచిన లాభమేమి? దైవవిధికి పాత్రులముగదా? భవిష్యత్తునుగురించి యాలోచించవలెను. అమ్మా!

మేమడుగు ప్రశ్నలకు జవాబొసంగుము. నీవిప్పుడేమి జేయ నెంచితివి?'' అని రాజేశ్వరరావడిగెను.

"నేనా? నాకేమియు లేదు. నా కాత్మహత్యదక్క వేఱుదారి లేదు. కావున మీరు నన్ను కాపాడకండి. నాత్రోవ నేను జూచుకొనెదను. సెలవొసంగుడు."

"అమ్మాయీ! నీకెన్నికష్టములు సంప్రాప్తమయినను నీవిట్టితలంపు పెట్టుకొనరాదు."

"సోదరికన్నమిన్నగ భావించి నన్నుగాపాడిన యోగ్యసహోదరులారా? నన్నీవిధమున మీరెంతకాలము గాపాడెదరు? యిప్పటికే నావల్ల మీకు చాలశ్రమగలిగె ''నని యింకేమియో జెప్పబోవుచుండ వారిరువు రిట్లన దొడంగిరి.

"సోదరీ! అట్లనవలదు. మాకిదియొక శ్రమయా? నిన్నింతగ గాపాడుట కూడ నీకష్టములు కడతేర్చి నిన్నొక సంపన్నునకిచ్చి వివాహముజేసి మేము సంతోషించవలయునను కోరిక తోడనే'' యని చెప్పి వారిరువురును తమ యావచ్ఛక్తిని వినియోగపఱచి యెట్టకేలకామెను పునర్వివాహమున కొప్పించగల్గిరి.

౪.

ఒకనాటి ప్రాతఃకాలమున గోవిందరావుగారు తన స్వగృహములో నొకచిన్న గదిలో కుర్చీపై నాసీనుడై వార్తాపత్రిక జదువుచుండ నిరువురు మిత్రులు వచ్చి యిట్లు సంభాషింప దొడంగిరి.

"గోవిందరావుగారూ! మీ రీసాయంకాలము జరుగబోవు సంఘసంస్కరణ సభకు బోదలంచితిరా?"

"ఏమీ? సంఘసంస్కరణసభయా! ఇందుకు సంబంధించిన సభలకు నేబోవ నవసరములేదు. స్త్రీ పునర్వివాహవిషయమై నన్నొప్పించగలవారెవరును గానరా" రని ఖండితముగ జెప్పుచుండగా నొకజవానువచ్చి గోవిందరావుగారి కొక జాబునిచ్చెను. విప్పిచూచి ఈవిధమున జదువదొడంగెను.

"మహాశయా!

తమరీపురమున పెద్దమనుష్యులగు వారిలో నొకరైయున్నారు. పునర్వివాహవిషయమై తమతో మాట్లాడ కుతూహలపడుచున్నాము. కాన సాయంకాలము మూడుగంటలకు సభ జరుపనిశ్చయించితిమి. మీరీలోపుగనే మమ్ముల నొకసారి కలుసుకొన ప్రార్థించుచుంటిమి.

ఇట్లు

సంఘసంస్కరణాభిలాషి, మోహనరావు."—

"ఏమోయీ! శేషాచలం. సమయమునకే జాబువచ్చెనే? సరే చూతము. పోయి మాట్లాడెదను. మీరుకూడపోయి రేపొకమారు రండు. నేను స్నానపానాదులొనర్చి ప్రచారకుల కలియుదు" నని గోవిందరావు చెప్పెను. గోవిందరావు తన పనుల నెరవేర్చుకొని ఉపన్యాసకుని బసకరిగెను. సంఘసంస్కర్తయగు వెరాహవరావుగారు వీరి రాకనుజూచి "అయ్యా! రండు. ఇందుపై యాసీనులుగండు" అని యచ్చటనే ద్వారమువద్దనున్న నొకకుర్చీని జూపెను.

అందరు నొకింతసేపు ప్రపంచధర్మమునుగురించి ముచ్చటించినపిదప ప్రచారకు డిట్లనియెను.

"గోవిందరావుగారూ! ఈ పురమందు మేము సభ నేర్పఱచుచున్న కారణము మీరుకూడ నిందు పాల్గొని మాకు తగుసాహాయ్యముచేయుదురనియే. స్త్రీ పునర్వివాహ విషయమై మీ యభిప్రాయమేమి?"

"నా కట్టి వివాహములన్న సరిపడదు."

"ఎందుచేత?"

(ముఖము చిట్లించుకొనుచూ) "స్త్రీ పునర్వివాహము మనమతమున లేదు. దానిని మనధర్మశాస్త్రము లొప్పవు. అదియునుగాక ప్రథమభర్తతో కాపురముచేయు భాగ్యము లేని యువతికి పునర్వివాహమొనర్చినచో నట్టియదృష్టము నిలచునా? మన హిందూ నారీమణులలో భర్తగతించిన తరువాత విధవలుగానుండి భక్తురాండ్రయి ఉండినచో భర్తయాత్మకు శాంతినొసంగిన వారగుదురు."

"అలాగా? విధవల నావిధముగ నాదర్శముగనుంచవలయు ననియేనా మీ యభిమతము? అట్లుందురను గట్టినమ్మకము మీకు కలదా?"

"ఆ! లేకేమి? అట్లుందురనియు, మనవారిలో చాలమం దటులజేయుచుండి రనియే నా దృఢనిశ్చయము."

"మీ యభిప్రాయమును నేను విశ్వసింపజాలను. ఈ యత్యాచారముల వలన కొందరు హిందూయువతీమణులు వ్యర్థురాండ్రగుటయే గాక యాత్మహత్యలకుగూడ లోనగుచున్నారు."

"మన హిందూగృహముల యందట్టివిధవలు పూజనీయులై యు[illegible] మాల్పె గృహకృత్యములందు సర్వాధికారిణులై మెలంగుట కనులార గాంచుచుంటిమి. కొందరు

115

స్త్రీలు వ్యర్థురాండ్రగుచున్నారన్న సంగతి వ్యక్తికిజెందిన విషయమేగాని హిందూసంఘమున కేమాత్రమును వర్తించదు."

"మిమ్ముల నాధారపడి యొకయువతియున్నచో మీరటు లాదర్శముగ నుంచుదురా?"

"ఆహా! సందియమేల? నాకొక విధవసోదరి యుండెడిది. ఆమె కొంతకాలము క్రిందటనే శ్వశురగృహముననే గతించె"నని యింకేమియో జెప్పుచుండ గోవిందరావు ఆసీనుడై యున్న కుర్చీ వెనుక తలుపు తెరువబడి యకస్మాత్తుగ నొకనారీరత్న మిటుల సంభాషింపజొచ్చెను.

"రామశాస్త్రీ, లక్ష్మీదేవమ్మగార్ల పుత్రికయైన యభాగినియగు సరస్వతి మరణించె ననుకుంటివా? లేదు సజీవియైయే యున్నది."

గోవిందరా వాశ్చర్యమున ఖిన్నవదనుడై తలక్రిందికి వ్రాల్చెను. మరల సరస్వతి యిటులని చెప్పసాగెను.

"కొందరు వితంతువులు మాతృగృహమున సర్వాధికారిణులై మెలంగుట కనులార గాంచుచుంటినని పలుకుచుంటివా? సర్వాధికారిణులన నీసోదరిని నిరాధారముగ గూడూరుస్టేషనున దిగవిడచుటయా? స్త్రీపునర్వివాహములు మన ధర్మశాస్త్రము లొప్పవని చెప్పుచుంటివి. మాయోపాయముపన్ని విధవసోదరిని వెంటనిడికొని ఒంటరిగా విడచిరమ్మని నీ కేహిందూశాస్త్రములు బోధించెను? విధవలు భక్తురాండ్రై మెలంగుదురనుచుంటివి. భక్తురాలనై మెలగుటకేనా తీర్థయాత్రయను మిషచే నట్టేట ముంచితివి? ఓ పూర్వాచారపరాయణులారా! ఇంకెంతకాల మీపట్టుదల. ఈ బాలవితంతువుల శ్రమలు మీకు నేత్రానందముగ నుండెనా? మా కష్టము లెఱింగికూడ నరకకూపమున బడద్రోయుచుంటిరా? ఇకనైనను మీ గట్టినమ్మకములను బారద్రోలి మా సుఖదుఃఖముల నెఱిగియుందురు గాక. సంఘసంస్కర్తలారా! మీ రిట్టి యుద్యమములందు పాల్గొని ప్రచారముజేసి పునర్వివాహము లొనర్చుటలో వితంతువుల పాలిటి కల్పవృక్షమని వేరుగ జెప్పవలయునా! మన హిందూసంఘమందలి మాలిన్యము బోగొట్టి స్త్రీ పునర్వివాహములు జేయించి పుణ్యమును గట్టుకొనుడు. సోదరీమణుల సద్గోగతిపాలుచేయు కూరులను సంఘమేల బహిష్కరింపదో గదా? రామమోహనరాయలు మొదలగు పురుషులు జన్మించిన యీ భరతభూమి నేడిట్టి దుష్టుల కాలవాల మయ్యెనా?"

అంతట గోవిందరావు కంపితస్వరముతో "సోదరీ! యిట్టి దూషణవాక్యములచే నన్నేల పాతాళమున కణగద్రొక్కెదవు. ఈయపరాధి నింకను క్షమింపవా? దుర్మదాంధుడనై యట్లొనర్చితిని."

అంతట సరస్వతి మిగుల క్రోధముతో "నీకొక సోదరి గలదా? ఇంత దుర్మార్గమొనర్చిన నీవు నాకెట్టి సోదరుడవు? ఆనాడు రైలుస్టేషనున దుఃఖించుచుండ నాదుఃఖమే తనదుఃఖముగ భావించి నన్నుగాపాడిన ఈ రాజేశ్వరరావుగారే నా సోదరులు."

"సరస్వతీ! సరస్వతీ! నేనును నీసోదరుడను."

"నీవా? నీవు నాకు సోదరుడవా? నీవు ప్రథమజన్మమున సోదరుడవై నరకమున బడద్రోయగా స్వర్గమునకు దారిజూపి నీ యెదుట గూర్చునియున్న కాంతారావుగారి కిచ్చి పునర్వివాహముగావించిన రాజేశ్వరరావుగారే నా నిజమగు సోదరుడు."

"సోదరీ! నీవేదిచెప్పినను జేయుటకు సంసిద్ధుడనై యున్నాను".

"అట్లైన నీవీదినము మొదలుగా, సంఘసంస్కర్తవై స్త్రీపునర్వివాహము లందు నీయావచ్ఛక్తిని వినియోగించెదనని శపథము జేయుము."

వెంటనే గోవిందరావొక పుస్తకమును చేతనిడికొని చెల్లెలియాజ్ఞప్రకారము, శపథము చేసెను.

శారదాబిల్లు ప్రశంస

శ్రీమతి బి. జ్ఞానాంబగారు

భారతీయులు ధర్మంబు బాయరేని
వీరనారులు పతిభక్తి విడువరేని
సత్యదేవత దేశంబు సడలదేని
శారదాబిల్లు తీవ్రమైసాగుగాక!

తొలగిపోవును వైధవ్యదుఃఖసమితి
బాసిపోవును వరకట్నబాధలింక
బీదసాదలు హాయి జీవింపగలరు
విపులసుఖమబ్బు శారదాబిల్లువలన.